సాక్షి
వనపర్తి

సోమవారం । 12 । ఆగస్టు । 2024



బడుల్లో స్వచ్ఛత

ప్రభుత్వం పాఠశాలల్లో స్వచ్ఛతకు ప్రాధాన్య మిస్తూ నిధుల విడుదలకు ముందుకొచ్చింది.

వివరాలు 8లో ▸



జూరాలకు తగ్గిన ఇన్‌ఫ్లో

జూరాల జలాశయానికి ఎగువ నుంచి వచ్చే వరద తగ్గుముఖం పట్టింది.

వివరాలు 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
28.6 /23.4

వాతావరణం

రోజంతా ఆకాశం నిర్మానుష్యంగా ఉంటుంది. అప్పుడప్పుడు మేఘావృతమై మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

జూనియర్ డాక్టర్ హత్యపై కేంద్రం స్పందించాలి

వనపర్తి: దేశవ్యాప్తంగా సంచలనం రేకెత్తించిన జూనియర్ డాక్టర్ హత్య కేసుపై కేంద్రం స్పందించి సమగ్ర విచారణ చేపట్టాలని రాష్ట్ర ఏఐపీసీ మెడికల్ కో–ఆర్డినేటర్ డా. ఆదిత్యారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. కోల్‌కత్తా ఆర్‌జీ కార్ మెడికల్ కళాశాలలో పోస్ట్ గ్రాడ్యుయేట్ ట్రైనీ డాక్టర్‌పై అత్యాచారం చేసి దారుణంగా హత్య చేసిన వారిని పట్టుకొని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. దేశంలో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని, ఉన్నత విద్యకు ఇతర ప్రాంతాలకు వెళ్లిన విద్యార్థులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత కేంద్రం తీసుకోవాలని కోరారు. లేదంటే కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

ధరలకు అనుగుణంగా కూలి పెంచాలి



అమరచింత: పెరిగిన ధరలకు అనుగుణంగా కూలీలకు ఇచ్చే వేతనాలు పెంచాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అజయ్ డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో వ్యవసాయ, బీడీ కార్మికులను కలిసి వారి దినసరి కూలి గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 2018లో కనీస వేతనం రోజువారీగా రూ.375 చెల్లించాలని సిఫార్సు చేస్తే రూ.178కి ఆమోదం తెలపడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కనీస వేతనాలను పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చినా వాటిని తుంగలో తొక్కారని ఆవేదన వ్యక్తం చేశారు. హర్యానాలో రూ.350 ఉంటే.. తెలంగాణలో మాత్రం రూ.300 ఉందని, కూలి చెల్లింపుల్లో ఆడ, మగ తేడా చూపడం సరికాదన్నారు. రోజురోజుకు నిత్యావసర సరుకుల ధరలు పెరుగుతున్నాయని.. కొనలేని స్థితిలో కార్మికులు ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రేషన్ దుకాణాల ద్వారా ప్రభుత్వం 14 రకాల నిత్యవసర సరుకులు పంపిణీ చేసి పేదలను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సాయమ్మ, సంతోషమ్మ, శిరీష, అరుణ, సంధ్య, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతోనే జ్ఞానం పెంపొందుతుంది



కొత్తకోట రూరల్: పుస్తకాలు చదివితే జ్ఞానం పెంపొందుతుందని.. ప్రతి ఒక్కరు పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని రిటైర్డ్ ప్రొఫెసర్ ప్రహ్లాద్‌కుమార్ కోరారు. మండలంలోని అమడబాకులలో ప్రహ్లాద్‌కుమార్ కొంతకాలంగా తన తల్లి జ్ఞాపకార్థం గ్రంథాలయం నిర్వహిస్తున్నారు. ఆదివారం కేజీబీవీ విద్యార్థులకు పుస్తకాల ప్రాముఖ్యత గురించి గ్రంథాలయంలో అవగాహన కల్పించారు. పోటీ ప్రపంచంలో కష్టపడి చదివితేనే ఉన్నత లక్ష్యాలను చేరుకుంటారన్నారు. ప్రతి విద్యార్థి పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో చదివి ఉన్నత ఉద్యోగాలు సాధించిన వారు ఎందరో ఉన్నారని.. అలాంటి వారిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు విజ్ఞానం, వినోదం, సైన్స్, కథల పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చిరుత.. చిక్కేనా?

8 నెలలుగా 'ఖిల్లా' పరిసరాల్లోని అడవులు, గుట్టల్లో సంచారం

- బలవుతున్న మూగ జీవాలు
- రెండు, మూడు చిరుతలున్నట్లు అనుమానం
- మామిడిమాడ–వనపర్తి రోడ్లలో రాకపోకలు బంద్
- భయాందోళనలో ప్రజలు, రైతులు



● 'ఇతడి పేరు పరమేశ్వర్.. మామిడిమాడ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో సహాయ లైన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. 20 రోజుల కిందట ఉదయం సమయంలో జంగమాయపల్లి నుంచి అటవీ మార్గంలోని రోడ్డు వెంట మామిడిమాడకు వెళ్తుండగా.. రోడ్డు పక్కన చెట్లలో చిరుత గాండ్రిస్తూ కనిపించింది. భయంతో వెనక్కి తిరిగి చూడకుండా మామిడిమాడకు వెళ్లాడు. నాటి నుంచి ఆ మార్గంలో వెళ్లాలంటేనే వణికిపోతున్నాడు. తోటి వారిని కూడా ఆ దారిలో వెళ్లొద్దని చెబుతున్నాడు.'

ఖిల్లాఘనపురం: ఖిల్లాఘనపురం ఫారెస్టు రేంజ్ పరిధిలోని పలు గ్రామాల్లో చిరుత తరుచూ ప్రజలకు కనిపిస్తూ జీవాలపై దాడి చేసి చంపేస్తున్నాయి. ఒక రోజు ఓ గ్రామం.. మరోరోజు మరో గ్రామ శివారుల్లో కనిపించడంతో రెండు, మూడు చిరుతలు ఉన్నాయా అన్న అనుమానాన్ని ఈ ప్రాంత ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. చిరుత సంచారంతో ఖిల్లాఘనపురం, నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం గంగారం, లట్టుపల్లి తండాలు, పెద్దమందడి మండలంలోని జంగమాయపల్లి, బలిజపల్లి తదితర గ్రామాల ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. రాత్రి వేళల్లో ఆయా గ్రామాల ప్రజలు బయటకు వెళ్లాలంటేనే వణికిపోతున్నారు. అటవీశాఖ అధికారులు ఎలాగైనా వాటిని బంధించి తీసుకెళ్లాలని కోరుతున్నారు.

8 నెలలుగా ఖిల్లాఘనపురం రేంజ్ పరిధిలోనే..

2023, డిసెంబర్ 9న మండల కేంద్రం సమీపంలో మహబూబ్‌నగర్ వెళ్లే రహదారి వంతెన దగ్గర వెంకటాంపల్లికి చెందిన సిద్ది పర్వతాలుకు చెందిన ఆవు దూడను ఎత్తికెళ్లి చంపి తినేసింది. ఇది గమనించిన పలు గ్రామాల ప్రజలు, అటవీశాఖ అధికారులు దాడి చేసింది చిరుతనా లేక హైనానా పరిశీలించారు. మండల కేంద్రానికి దగ్గరలో అది కూడా నిరంతరం వాహనాలు తిరిగే బీటీ రోడ్డు పక్కకు ఎలా వచ్చిందని ఆలోచిస్తున్న సమయంలోనే రాంరాయనిపల్లి సమీపంలోని బోడగుట్టపై రెండు చిరుతలు కనిపించాయి. గుట్ట చుట్టున్న గ్రామాలు, తండాల ప్రజలు ప్రత్యక్షంగా చూశారు. గుట్ట పక్కనున్న పశువుల పాక దగ్గరకు వచ్చేందుకు యత్నిస్తుండటంతో కుక్కలు గుర్తించి మొరగడం, గ్రామస్తులు అక్కడికి చేరుకొని కేకలు వేయడంతో గుట్ట పైకి వెళ్లాయి. తర్వాత పర్వతాపురం, మామిడిమాడ, షాపురం, మానాజీపేట, సల్కెలాపురం, బిజినేపల్లి మండలం వసరతండా, పెద్దమందడి మండలం జంగమాయపల్లి, బలిజపల్లిలో రోజుకు ఒక గ్రామంలో కనిపించడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. రెండు, మూడు చిరుతలు ఉన్నాయని.. అందుకే రోజుకు ఓ గ్రామశివారులో కనిపిస్తున్నాయని ప్రజలు చెబుతున్నారు.



బంధించేందుకు బోను ఏర్పాటు చేసిన డీఎఫ్‌ఓ తదితరులు (ఫైల్)

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినా..

ఖిల్లాఘనపురం ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని పలు గ్రామాల గుట్టల ప్రాంతంలో చిరుత కనిపిస్తుండటంతో ఆ శాఖ అధికారులు బోడగట్టు, ఖిల్లాఘనపురం ఎర్రకుంట, జంగమాయపల్లి, బలిజపల్లి తదితర అటవీ ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుచేసి సంచారాన్ని గుర్తించాలని చూశారు. అయినా పట్టపగలే ఖిల్లాఘనపురం గుట్టపై ఓ మేకను ఎత్తుకెళ్లి తినేసింది. ఈ సమయంలో కాపరి ధైర్యం చేసి సెల్‌ఫోన్‌లో వీడియో తీశారు.

బంధించేందుకు..

చిరుత సంచారాన్ని నిర్ధారించుకున్న అధికారులు జిల్లా అటవీశాఖ అధికారి నవీన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఖిల్లాఘనపురం, షాపురం తదితర గ్రామాల శివారుల్లో బోను ఏర్పాటు చేశారు. కాని ఇప్పటి వరకు చిరుత చిక్కలేదు.



ఖిల్లాఘనపురం శివారులో మేకను ఎత్తుకెళ్లి తింటున్న చిరుత (ఫైల్)

కర్నెతండా దాటిన తర్వాత కనిపించింది..



నెల కిందట వనపర్తికి వెళ్లేందుకు మా ఊరి నుంచి బైక్‌పై బయలుదేరాను. కర్నెతండా దాటి కొంత దూరం వెళ్లాక రోడ్డు పక్కనున్న ఓ తంగేడు చెట్టు వద్ద చిరుత కనిపించింది. ప్రాణం పోయినంత పనైంది. 10 నిమిషాల్లో జంగమాయపల్లికి చేరుకుని అక్కడ ఆగి నీళ్లు తాగా. ఈ విషయాన్ని మా కుటుంబ సభ్యులు, మిత్రులకు తెలియజేశా.

– టి.పరమేశ్వర్‌గౌడ్, అప్పారెడ్డిపల్లి, ఖిల్లాఘనపురం మండలం

బంధించేందుకు ప్రయత్నిస్తున్నాం..



ఖిల్లాఘనపురం అటవీ ప్రాంతంలో సుమారు 8 నెలలుగా చిరుత సంచరిస్తోంది. ఆవాసం ఏర్పరచుకోకుండా రోజుకు ఓ గుట్టకు వెళ్తూ జీవాలపై దాడి చేస్తోంది. ప్రస్తుత పరిస్థితుల్లో అడవి దారిలో ఎవరూ వెళ్లొద్దు. ఒకటి కంటే ఎక్కువ చిరుతలు అనిపిస్తుంది. వాటి కదలికలను పరిశీలించి బోను ఏర్పాటు చేశాం. కచ్చితంగా పట్టుకుంటాం. పొలాలకు వెళ్లే రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

– నవీన్ రెడ్డి, జిల్లా అటవీశాఖ అధికారి, వనపర్తి

ప్రత్యక్షంగా చూశా..



మాకు పర్వతాపురం శివారులో రైస్‌మిల్ ఉంది. మూడు నెలల కిందట ఉదయం 9 గంటల ప్రాంతంలో రైస్‌మిల్ ఎదుట నిలబడగా కొంత దూరంలో చిరుత నడుచుకుంటూ వెళ్తూ కనిపించింది. భయంతో లోపలికి పరుగులు తీశా. అప్పటి నుంచి పగలు, రాత్రి ఎప్పుడు గేటు మూసి ఉంచుతున్నా. ఎవరైనా వచ్చి పిలిస్తేనే గేటు తీస్తున్నా.

– నందకిశోర్, సోళీపురం, ఖిల్లాఘనపురం మండలం

మామిళ్ల వర్సెస్ కోరమోని..!

డీసీసీబీ చైర్మన్ గిరికి పోటాపోటీ

- నిజాంపాషా రాజీనామాతో ఖాళీ అయిన సీటు
- మంత్రి జూపల్లి కృష్ణారావుతో వెంకటయ్య భేటీ
- అన్నీ కలిసొస్తే కాంగ్రెస్ గూటికి..?
- ఎంపీ మల్లు రవితో విష్ణువర్ధన్‌రెడ్డి మంతనాలు





మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి



కోరమోని వెంకటయ్య

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ చైర్మన్ గిరికి పోటాపోటీ నెలకొంది. నిజాంపాషా అనారోగ్య రీత్యా ఇటీవల చైర్మన్ పదవికి రాజీనామా చేయడంతో ఈ పదవి ఖాళీ కాగా.. బీఆర్‌ఎస్‌కు చెందిన డీసీసీబీ వైస్ చైర్మన్ కోరమోని వెంకటయ్యతోపాటు డీసీసీబీ డైరెక్టర్, కాంగ్రెస్‌కు చెందిన మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి పోటీపడుతున్నట్లు తెలుస్తోంది. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత సుమారు పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ అన్ని ఎన్నికల్లోనూ సత్తాచాటింది. సహకార సంఘాల ఎన్నికల్లో సైతం ఆ పార్టీదే పైచేయిగా నిలిచింది. అయితే గత డిసెంబర్‌లో అసెంబ్లీ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం చేపట్టగా.. రాజకీయ పరిణామాలు వేగంగా మారాయి. ఉమ్మడి జిల్లాలో 14 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా.. 12 స్థానాల్లో ఆ పార్టీ అభ్యర్థులే గెలుపొంది ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ఎనుముల రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించగా.. ఆ పార్టీ అధిష్టానం పాలమూరుపై ప్రత్యేక దృష్టిసారించింది. ఈ క్రమంలో తొలుత డీసీసీబీ పీఠంపై నజర్ వేసినప్పటికీ.. చైర్మన్‌గా ఉన్న బీఆర్‌ఎస్ నేత నిజాంపాషా ఆస్పత్రిలో చికిత్స పొందుతుండడంతో వేచి చూస్తూ వచ్చింది. ఈ క్రమంలో ఆయన రాజీనామా చేయడంతో చైర్మన్ పీఠంపై పలువురు గురిపెట్టినట్లు తెలుస్తోంది.

బీఆర్‌ఎస్‌కే బలం..

డీసీసీబీ పరిధిలో 77 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ఉన్నాయి. వీటి పరిధిలో డీసీసీబీ డైరెక్టర్లుగా 15 మంది ఉన్నారు. ఇందులో 12 మంది బీఆర్‌ఎస్ వారు కాగా.. ముగ్గురు కాంగ్రెస్‌కు చెందిన వారు ఉన్నారు. ఈ లెక్కన బీఆర్‌ఎస్‌కే బలం ఉన్నట్లు స్పష్టమవుతుండగా.. రాష్ట్రంలో మారిన రాజకీయ పరిణామాల క్రమంలో ఎవరు ఎటు వైపు ఉన్నారో అనేది సందేహాస్పదంగా మారింది. ఈ క్రమంలో డీసీసీబీ చైర్మన్ పదవి కోసం కొల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పాన్‌గల్ మండలం కేతేపల్లి గ్రామానికి చెందిన డీసీసీబీ డైరెక్టర్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవి ద్వారా ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం.

కాంగ్రెస్ వైపు మొగ్గు..?

బీఆర్‌ఎస్‌కు చెందిన డీసీసీబీ వైస్ చైర్మన్ కోరమోని వెంకటయ్య సైతం చైర్మన్ గిరి కోసం విశ్వప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. మారిన పరిణామాల క్రమంలో ఆయన కాంగ్రెస్ వైపు మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుతో భేటీ అయినట్లు వినికిడి. మంత్రి ఆదేశాల మేరకు కోరమోని ఇప్పటికే ఉమ్మడి జిల్లాకు చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, డీసీసీ అధ్యక్షులు పలువురిని కలిసినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జోరుగా సాగుతోంది. దీనిపై ఆయనను ఫోన్‌లో సంప్రదించగా 'డీసీసీబీ చైర్మన్ రేసులో ఉన్న మాట వాస్తవమే. బీఆర్‌ఎస్‌కు బలం ఉంది.. ఏం జరుగుతుందో చూడాలి' అని సమాధానమిచ్చారు.

జూపల్లి ఎటు వైపో..

సీనియర్ రాజకీయ నేత, మంత్రి జూపల్లి కృష్ణారావు కొల్లాపూర్ నుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్న విషయం తెలిసిందే. అయితే ఇదే నియోజకవర్గానికి చెందిన మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డికి ఆయనకు మధ్య విభేదాలు ఎప్పటి నుంచో ఉన్నాయి. ఈ క్రమంలో మామిళ్లపల్లికి ఆయన మద్దతిస్తారా అనేది చర్చనీయాంశంగా మారింది. ఈ మేరకు ఎంపీ మల్లురవి మామిళ్లపల్లి తరఫున రాయబారం నడుపుతున్నట్లు ఆ పార్టీ వర్గాలు గుసగుసలాడుతుండగా.. బీఆర్‌ఎస్‌కు చెందిన కోరమోని వెంకటయ్య తెరపైకి రావడం హాట్‌టాపిక్‌గా మారింది. దీని వెనుక స్కెచ్ పక్కాగా ఉన్నట్లు రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. మొత్తానికి మంత్రి జూపల్లి ఎటువైపు మొగ్గుతారా అనేది ప్రశ్నార్థకంగా మారగా.. పార్టీ శ్రేయస్సు, గెలుపోటముల బేరీజు ప్రకారం తగిన నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

నేడు మార్కెట్‌లో లావాదేవీలు

దేవరకద్ర: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం లావాదేవీలు ప్రారంభం కానున్నాయి. రెండు రోజులుగా మార్కెట్‌కు సెలవు కారణంగా లావాదేవీలు జరగలేదు. శనివారం హమాలీ వాకిటి కృష్ణయ్య మృతిచెందిన కారణంగా మార్కెట్‌కు సెలవు ఇచ్చారు. ఆదివారం ప్రభుత్వ సెలవు ఉండడంతో మార్కెట్ బంద్ చేశారు. సోమవారం మార్కెట్‌లో యథావిధిగా టెండర్ల ద్వారా ధాన్యం కొనుగోళ్లు జరుగుతాయని అధికారులు తెలిపారు.

పార్టీ విధేయులకు ప్రాధాన్యం

- స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్యకర్తలను గెలిపించుకోవాలి
- రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి దామోదర రాజనర్సింహ



మదనాపురంలో మాట్లాడుతున్న రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ.. చిత్రంలో ఎమ్మెల్యేలు జి.మధుసూదన్‌రెడ్డి, మేఘారెడ్డి, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు వంశీచంద్‌రెడ్డి

మదనాపురం: కార్యకర్తలే మా బలం.. బలగం అని, పార్టీ విధేయులకు ప్రాధాన్యం ఇస్తామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచ్‌లు, జిల్లా, మండల పరిషత్, డీసీసీబీల్లో మన వారిని గెలిపించుకోవాలని పేర్కొన్నారు. ఆదివారం వనపర్తి జిల్లా మదనాపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జాతీయ రహదారిపై ప్రమాదాలు జరిగితే 20 నిమిషాల్లో క్షతగాత్రులకు చికిత్స అందించేందుకు మూసాపేట వద్ద ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే దేవరకద్రలో 100 పడకల ఆస్పత్రి నిర్మాణానికి రూ.35 కోట్లు మంజూరు, కొత్తకోట పీహెచ్‌సీని 30 నుంచి 50 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేస్తామన్నారు. అనంతరం దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీని నమ్ముకున్న కార్యకర్తలకు సముచిత స్థానం కల్పిస్తామని చెప్పారు.

ప్రమాణం చేసిన పాలకవర్గం..

మంత్రి దామోదర రాజనర్సింహ, దేవరకద్ర, వనపర్తి ఎమ్మెల్యేలు జి.మధుసూదన్‌రెడ్డి, మేఘారెడ్డి సమక్షంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఎన్నికైన పల్లెపాగు ప్రశాంత్, వైస్ చైర్మన్ కె.తిరుపతి రెడ్డితోపాటు పాలకవర్గ సభ్యులతో జిల్లా మార్కెటింగ్‌శాఖ అధికారి స్వరణ్‌సింగ్ ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం కొన్నూరులో రూ.2.18 కోట్లతో నిర్మించిన 11 కేవీ సబ్‌స్టేషన్, రూ.20 లక్షలతో నిర్మించిన ఆరోగ్య ఉపకేంద్రం, రూ.20 లక్షలతో నిర్మించిన పంచాయతీ కార్యాలయ భవనంతోపాటు ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాల భవనాలను మంత్రి ప్రారంభించారు. వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి, డీఈఓ గోవిందరాజులు, పీఆర్ ఇంజినీర్ మల్లయ్య పాల్గొన్నారు.

కార్యకర్త చొక్కా పట్టి తోసేసిన ఎమ్మెల్యే

వనపర్తి: వనపర్తి జిల్లా మదనాపురం మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవంలో ఆదివారం కార్యకర్తల మధ్య చిన్నపాటి వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో స్టేజీపై తాము వెళ్తామంటే.. తాము వెళ్తామని ప్రోటోకాల్‌ను పక్కన పెట్టి వెళ్లడంతో దేవరకంద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి ఘాటుగా స్పందించారు. కొందరు కాంగ్రెస్ నాయకులను చొక్కా పట్టుకుని స్టేజీపై నుంచి లాగి కిందకు పంపించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి దామోదర రాజనర్సింహ హాజరవడం గమనార్హం.




స్టేజీపై కార్యకర్త చొక్కా పట్టుకుని తోసేస్తున్న ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

విస్తరణ గుబులు..

గ్రీన్ కారిడార్‌గా మారనున్న 44వ నంబర్ జాతీయ రహదారి

- 12 లైన్లుగా విస్తరించేందుకు ప్రభుత్వం అడుగులు
- డీపీఆర్ సిద్ధమవుతోందని మంత్రి ప్రకటన
- మొదటి బిట్టులో భూములు, ప్లాట్లు పోతాయని బాధితుల ఆందోళన
- నిలిచిన క్రయవిక్రయాలు.. రియల్ వ్యాపారంపై తీవ్ర ప్రభావం



జడ్చర్ల మీదుగా 12 లైన్లుగా విస్తరించనున్న 44వ నంబర్ జాతీయ రహదారి

జడ్చర్ల: హైదరాబాద్– బెంగుళూర్ మధ్య 44వ నంబర్ జాతీయ రహదారిని 12 లేన్ల గ్రీన్ కారిడార్‌గా విస్తరిస్తారన్న వార్తలతో అనుసరించి ఉన్న భూములు, ప్లాట్ల యజమానుల్లో గుబులు నెలకొంది. జాతీయ రహదారిని నాలుగు లైన్లుగా విస్తరిస్తేనే పెద్దఎత్తున భూ సేకరణ చేశారని, ఇప్పుడు ఏకంగా 12 లైన్లుగా విస్తరిస్తే అంతకు మూడు రెట్లు తీసుకుంటారన్న ప్రచారం జరుగుతోంది. దీంతో జాతీయ రహదారిని అనుసరించి పెద్దమొత్తంలో డబ్బులు వెచ్చించి భూములు కొనుగోలు చేసిన వారు ఆందోళన చెందుతున్నారు. వీరిలో ఎక్కువగా వంద, రెండు, మూడు వందల చదరపు గజాల ప్లాట్ల దారులతోపాటు అర, ఎకరం భూమి కొనుగోలు చేసిన వారు ఉన్నారు. బహిరంగ మార్కెట్‌లో జాతీయ రహదారిని అనుసరించి ఎకరం భూమి రూ.3– 6 కోట్లు, చదరపు గజం రూ.15– 20 వేల పైబడి పలుకుతోంది. భవిష్యత్ అవసరాల నిమిత్తం ఆస్తులు అమ్ముకుని జాతీయ రహదారిని అనుసరించి భూములు, ప్లాట్లు కొనుగోలు చేశామని, ఇప్పుడు రహదారిని 12 వరుసలకు విస్తరిస్తే తమ భూములు, ప్లాట్లు పోతాయని లబోదిబోమంటున్నారు. తాము కొనుగోలు చేసిన ధరకు ప్రభుత్వం ఇచ్చేది తక్కువగా ఉంటుంది, ఈ భారీ వ్యత్యాసం వలన తాము నష్టపోతామని వాపోతున్నారు. అయితే జాతీయ రహదారిని విస్తరిస్తే రెండో బిట్లుగా ఉన్న తమ భూముల ధరలకు రెక్కలు వస్తాయని మరికొందరు భావిస్తున్నారు. ప్రస్తుతానికి జాతీయ రహదారి వెంట భూముల క్రయవిక్రయాలు మాత్రం నిలిచిపోయాయి.

నివాస ప్రాంతాలకు తీరని నష్టం

జాతీయ రహదారి విస్తరణతో నివాస ప్రాంతాలకు సైతం భారీ నష్టం వాటిల్లే పరిస్థితి ఉంది. కొన్ని గ్రామాలు జాతీయ రహదారిని అనుసరించి రెండు వైపులా ఉన్నాయి. అంతేగాక ప్రభుత్వ ఆస్తులకు కూడా తీరని నష్టం జరుగుతుంది. ప్రభుత్వ భవనాలు, మిషన్ భగీరథ, గ్యాస్ పైపులైన్లు తదితర అనేక నిర్మాణాలు ప్రస్తుత జాతీయ రహదారిని అనుసరించి ఉన్నాయి. 12 లైన్లుగా రహదారిని విస్తరిస్తే ఆయా నిర్మాణాలను పూర్తిస్థాయిలో తొలగించాల్సి వస్తుంది.

డీపీఆర్‌తో స్పష్టత

జాతీయ రహదారి 12 లైన్ల విస్తరణకు సంబంధించి ప్రభుత్వం రూపొందించే డీపీఆర్ (డిటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్)తో స్పష్టత వచ్చే అవకాశం ఉంటుంది. డీపీఆర్‌పై ఇప్పటికే రాష్ట్ర ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పష్టత ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో 12 లైన్ల రహదారి విస్తరణ చేపట్టనున్నారు. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం సహాయ, సహకారాలను అందజేస్తుందని పాలకులు పేర్కొంటున్నారు. 12 లైన్ల రహదారిపై కనీసంగా 120 కి.మీ.,ల వేగానికి తగిన విధంగా రహదారి నిర్మాణం ఉంటుందని భావిస్తున్నారు.

జడ్చర్ల ప్రాంతం అభివృద్ధి



జడ్చర్ల మీదుగా హైదరాబాద్– బెంగుళూర్ జాతీయ రహదారిని 12 లైన్లుగా విస్తరించడం జరుగుతుంది. ఈ రహదారిని గ్రీన్ కారిడార్‌గా విస్తరించడంతో జడ్చర్ల ప్రాంతం అభివృద్ధి చెందుతుంది. దీనిపై ఇప్పటికే రాష్ట్ర ఆర్‌అండ్‌బీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పష్టత ఇచ్చారు. డీపీఆర్ వస్తే పూర్తి వివరాలు తెలుస్తాయి. విస్తరణతో జాతీయ రహదారిపై ఉన్న భూములకు మరింత డిమాండ్ వస్తుంది. – అనిరుధ్‌రెడ్డి, ఎమ్మెల్యే, జడ్చర్ల

కొలతలు నిర్ధారించాలి..



మల్లెబోయిన్‌పల్లి శివారులో జాతీయ రహదారిపై ఆర్నెల్ల కిందట గుంటకు రూ.7 లక్షలు వెచ్చించి 11 గుంటల భూమిని కొనుగోలు చేశా. ఇప్పుడు జాతీయ రహదారిని 12 లైన్లుగా విస్తరిస్తున్నారని ప్రభుత్వం ప్రకటించడంతో భూములకు ఒక్కసారిగా డిమాండ్ పడిపోయింది. మా భూమి ఎంత వరకు రహదారిలో పోతుందో తెలియడం లేదు. విస్తరణకు సంబంధించి అటు ఇటుగా కొలతలు నిర్ధారించాలి. దీనిపై ప్రభుత్వం త్వరగా స్పష్టత ఇస్తే బాగుంటుంది.

– నాగరాజు, రైతు, మల్లెబోయిన్‌పల్లి

క్రయ విక్రయాలు బంద్



జాతీయ రహదారిని 12 వరుసలుగా విస్తరిస్తున్నారన్న వార్తలతో ఆ దారి వెంట క్రయవిక్రయాలు ప్రస్తుతం నిలిచిపోయాయి. రహదారిని అనుసరించి ఉన్న ప్లాట్లు, భూముల ధరలు కొంత మేరకు పడిపోయాయి. ప్రధానంగా ప్లాట్ల రేట్లు తగ్గాయి. రెండో బిట్టులో ఉన్న ప్లాట్లు, భూములకు డిమాండ్ ఏర్పడింది. రహదారిని 12 లైన్లుగా విస్తరిస్తే ఎంత వరకు కొలతలు ఉంటాయన్నది అధికారులు స్పష్టత ఇస్తే పుంజుకుంటాయి.

– శ్రీనివాసులు, రియల్ వ్యాపారి, జడ్చర్ల



దోమలపెంటలోని శ్రీశైలం ప్రధాన రహదారిలో ఇరువైపులా నిలిచిపోయిన కార్లు



ఘాట్‌రోడ్డులో బారులుదీరిన వాహనాలు



మొదటి వ్యూ పాయింట్ వద్ద ట్రాఫిక్‌ను పర్యవేక్షిస్తున్న పోలీసులు



ఈగలపెంటలోని టీజీ జెన్‌కో గ్రౌండ్‌లోకి మళ్లించిన వాహనాలు

ఘాట్ రోడ్డులో.. గంటల ప్రయాణం

శ్రీశైలం – హైదరాబాద్ ప్రధాన రహదారి అయిన నల్లమల ఘాట్ రోడ్డు.. వాహనదారుల సహనానికి పరీక్ష పెడుతోంది. కృష్ణానదికి వరదల నేపథ్యంలో శ్రీశైలం గేట్లు ఎత్తి దిగువకు నీటిని వదులుతుండటంతో జలదృశ్యాలను వీక్షించేందుకు పర్యాటకులు, శ్రావణమాసం కావడంతో శ్రీశైలం మల్లన్న దర్శనానికి భక్తులు ఒక్కసారిగా పోటెత్తారు. దీంతో శ్రీశైలం- హైదరాబాద్ రహదారి మొత్తం వాహనాలతో కిక్కిరిసిపోయింది. దోమలపెంట నుంచి సున్నిపెంట వరకు ఘాట్ రోడ్డులో వేలాది వాహనాలు నిలిచిపోయాయి. దీంతో గంటల తరబడి ట్రాఫిక్ స్తంభించి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పోలీసులు తీవ్రంగా శ్రమించి వాహనాలు క్రమపద్ధతిలో వెళ్లేలా చర్యలు తీసుకున్నారు. – దోమలపెంట

క్లుప్తంగా

రెండు బైక్‌లు ఢీ : యువకుడి దుర్మరణం

జడ్చర్ల: స్థానిక ఎంబీ చర్చి ఎదుట ఎదురెదురుగా వచ్చిన రెండు బైక్‌లు ఢీకొని ఓ యువకుడు మృతిచెందినట్లు సీఐ ఆదిరెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు.. పట్టణంలోని రాఘవేంద్రకాలనీకి చెందిన సమీర్ (21) ఆదివారం బైక్‌పై వెళ్తుండగా మరో బైక్ ఎదురుగా వచ్చి ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

డీసీఎం ఢీకొని మరొకరు..

ఆత్మకూర్: అతివేగంగా వస్తున్న డీసీఎం ఢీకొనడంతో ఓ యువకుడు మృతి చెందిన ఘటన ఆదివారం రాత్రి ఆత్మకూర్ మండలంలో చోటుచేసుకుంది. ఏఎస్ఐ బీచుపల్లయ్య కథనం ప్రకారం.. బాలకిష్టాపూర్‌కి చెందిన తెలుగు సింహయ్య(24) హైదరాబాద్‌లో పేయింటర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవలే సొంత గ్రామానికి వచ్చాడు. ఆదివారం రాత్రి 8 గంటలప్రాంతంలో బైకుపై ఆత్మకూర్‌కు వెళ్తుండగా గ్రామశివారులో ఎదురుగా వస్తున్న డీసీఎం ఢీకొంది. దీంతో సింహయ్య తలకు తీవ్రంగా గాయాలు కాగా మృతిచెందాడు. విషయాన్ని గమనించిన ప్రయాణికులు ఆత్మకూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈవిషయమై కుటుంబ సభ్యుల ఫిర్యాదుమేరకు కేసునమోదు చేసుకున్నామని.. డీసీఎంను స్వాధీనం చేసుకుని డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నామని ఏఎస్ఐ వివరించారు.

ఉయ్యాలవాడలో వ్యక్తి..



నగేష్ (ఫైల్)

నాగర్‌కర్నూల్ క్రైం: గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన ఉయ్యాలవాడలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. కుటుంబసభ్యులు తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా.. బిజినేపల్లి మండలం ఖానాపూర్ చెందిన నగేష్ (50) ఆదివారం ఉదయం నాయినోపల్లి మైసమ్మ దర్శనానికి వెళ్లి తిరిగి సాయంత్రం జిల్లా కేంద్రంలోని తన కూతురు వద్దకు వచ్చాడు. రాత్రి భోజనం ముగించుకుని తన ద్విచక్రవాహనంపై స్వగ్రామం ఖానాపూర్‌కు వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రంలోని జనరల్ ఆస్పత్రికి తరలించారు. ఎస్ఐ గోవర్ధన్‌ను వివరణ కోరగా గుర్తుతెలియని వాహనం వివరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మహబూబ్‌నగర్ క్రైం: రోడ్డు దాటుతున్న మహిళను తప్పించబోయి ద్విచక్ర వాహనంపై ఉన్న ఇద్దరికి గాయాలు అయ్యాయి. వివరాల్లోకి వెళితే అభంగపట్నంకు చెందిన కేశవులు పట్టణంలోని శివశక్తినగర్‌లో అద్దెకు నివాసం ఉంటున్నాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి దేవరకద్రలో బ్యాండ్ కొట్టడం ముగించుకుని ద్విచక్ర వాహనంపై రాములుతో పాటు మహబూబ్‌నగర్‌కు వస్తున్నారు. ఈ క్రమంలో మార్గమధ్యలోని మణ్యంకొండ స్టేజీ దగ్గర రోడ్డు దాటుతున్న మహిళను తప్పించబోయి బైక్ అదుపుతప్పి కిందపడ్డారు. దీంతో రాములు తలకు, కేశవులు శరీర భాగాలకు గాయాలు అయ్యాయి. బాధితుడు రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

2 ఇసుక టిప్పర్ల పట్టివేత

జడ్చర్ల: అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు టిప్పర్లను అదుపులోకి తీసుకొని కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివానందంగౌడ్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. తుంగభద్ర నది నుంచి జడ్చర్లకు ఇసుక తరలిస్తున్న టిప్పర్లను ఆదివారం 44వ నంబర్ జాతీయ రహదారిపై పట్టుకున్నామన్నారు. డ్రైవర్లను అనుమతి పత్రాలు అడుగగా తమ వద్ద ఎలాంటి పత్రాలు లేవని చెప్పడంతో స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు. టిప్పర్ల యజమానులు, డ్రైవర్లుగా ఉన్న వెంకటేశ్, లింబ్యాపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు.

బడుల్లో స్వచ్ఛత



మహబూబ్‌నగర్‌లోని రామయ్యబౌళి పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులు (ఫైల్)

- తరగతి గదులు, ఆవరణ, మరుగుదొడ్లలో పరిశుభ్రత పాటించేలా చర్యలు
- ప్రత్యేకంగా పారిశుద్ధ్య కార్మికుల నియామకానికి అవకాశం
- అమ్మ ఆదర్శ కమిటీలకు నేరుగా నిధుల విడుదల
- పాఠశాలల నిర్వహణ గ్రాంట్ సైతం వారి ఖాతాల్లోనే జమ
- విద్యార్థుల సంఖ్య ఆధారంగా నిధులు కేటాయించనున్న ప్రభుత్వం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తిస్థాయిలో పారిశుద్ధ్య చర్యలు చేపడుతూ.. పరిశుభ్రత పెంపొందించి.. ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యార్థులు చదువుకునేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందుకోసం ఈ నెల నుంచి అన్ని ప్రభుత్వ, లోకల్ బాడీ పాఠశాలలకు 'స్కూల్ ఫెసిలిటీ మెయింటెన్స్ గ్రాంట్'ను ప్రభుత్వం విడుదల చేయనుంది. అందుకోసం జీఓ నం.21 విడుదల చేసింది. అయితే నాలుగేళ్ల క్రితం ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్లు, తరగతి గదులు, పరిసరాలను శుభ్రం చేసేందుకు ప్రతి సంవత్సరం ప్రభుత్వం కొద్దిపాటి నిధులు విడుదల చేస్తే వాటి ద్వారా తాత్కాలిక సిబ్బందిని నియమించేవారు. ఆ తర్వాత ఆ బాధ్యతలను గ్రామ పంచాయతీ, మున్సిపల్ సిబ్బందికి అప్పగించారు. దీంతో వారు పూర్తిస్థాయిలో బాధ్యతలు నిర్వహించడం లేదన్న ఆరోపణలు వచ్చాయి. దీనిని దృష్టిలో పెట్టుకొని ఇటీవల ప్రభుత్వం పాఠశాలల్లో మహిళా సంఘాల ఆధ్వర్యంలో 'అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ'లను ఏర్పాటు చేసింది. ప్రస్తుతం పాఠశాలల పరిశుభ్రత, పారిశుద్ధ్య చర్యలు వంటి అంశాలను కూడా ఆయా సంఘాలకే అప్పగించింది.

పార్ట్‌టైం, ఫుల్‌టైం వర్కర్లు..

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లావ్యాప్తంగా మొత్తం 3,225 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో మరుగుదొడ్లు, తరగతి గదులు, పాఠశాల ఆవరణలో పరిశుభ్రత, మొక్కల సంరక్షణ వంటి అంశాల కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా గ్రాంట్ ఇవ్వనుంది. పాఠశాలల నిర్వహణ కోసం ఇప్పటికే సమగ్ర శిక్ష అభియాన్ కింద కాంపోజిట్ స్కూల్ గ్రాంట్‌ను ప్రభుత్వం అందిస్తుంది. వాటికి అదనంగా స్కూల్ ఫెసిలిటీ మెయింటెన్స్ గ్రాంట్‌ను కూడా ఈ నెల నుంచి ఇవ్వనున్నారు. వీటిని పూర్తిగా విద్యార్థుల సంఖ్య ఆధారంగా కేటాయిస్తుంది. ఈ నిధులు నేరుగా అమ్మ ఆదర్శ కమిటీ ఖాతాలో జమ చేయనున్నారు. ఈ కమిటీలు అనుమతి లేకుండా ఏ ఒక్క వ్యక్తి పేరు మీద నిధులు డ్రా చేయడానికి అవకాశం లేదు. కమిటీల ఆధ్వర్యంలో పార్ట్‌టైం, ఫుల్‌టైం వర్కర్లను నియమించుకోవాల్సి ఉంటుంది. వీరికి వేతనాల బాధ్యత కూడా కమిటీలకే అప్పగించింది.

జిల్లా	పాఠశాలలు
మహబూబ్‌నగర్	860
నాగర్‌కర్నూల్	845
వనపర్తి	535
నారాయణపేట	510
గద్వాల	475

నిధుల కేటాయింపు ఇలా..

విద్యార్థుల	సంఖ్య	నిధులు (రూ.లలో..)
1-	30	3,000
31-	100	6,000
101-	250	8,000
251-	500	12,000
501-	750	15,000
750పైన		20,000

కమిటీల ఆధ్వర్యంలోనే..



ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందుకోసం జీఓ నం.21 ద్వారా పారిశుద్ధ్య కార్మికులను నియమించేందుకు అవకాశం కల్పించింది. వీటి నిర్వహణ మొత్తం పూర్తిగా అమ్మ ఆదర్శ కమిటీల ఆధ్వర్యంలో జరుగుతుంది. విద్యార్థుల సంఖ్య ఆధారంగా నిధులను ప్రభుత్వం విడుదల చేస్తుంది.

– రవీందర్, డీఈఓ, మహబూబ్‌నగర్

మాడాపూర్‌లో విష జ్వరాల నివారణకు చర్యలు

పైపులైన్ల లీకేజీకి మరమ్మతు



మాడాపూర్‌లో పైపులైన్ల లీకేజీని సరి చేయిస్తున్న అధికారులు

లింగాల: మండలంలోని సూరాపూర్ పంచాయతీ పరిధిలో గల మాడాపూర్‌లో విష జ్వరాలు, కీళ్ల నొప్పులతో ప్రజలు బాధపడుతున్నట్లు కథనాలు రావడంతో అధికారులు స్పందించారు. ఆదివారం ఎంపీడీఓ ఆంజనేయులు ఆధ్వర్యంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు గ్రామాన్ని సందర్శించి తాగునీరు కలుషితం కావడాన్ని గమనించారు. మిషన్ భగీరథ పైపులైన్లు లీకేజీలు వద్ద మరమ్మతు చేపట్టారు. ప్రజలు ట్యాంకు ద్వారా వచ్చే నీటిని తాగుతుండడంతో శుభ్రం చేసేందుకు నిర్ణయించారు. గ్రామంలో పారిశుద్ధ్య పనులు వెంటనే చేపట్టాలని ఎంపీడీఓ పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. ఇళ్ల మధ్య పెంట కుప్పలు, చెట్ల పొదలు ఉంటే తొలగించాలని, దోమల నివారణ మందును పిచికారి చేయించాలని ఎంపీడీఓ సూచించారు. ఇళ్ల చుట్టు పక్కల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు తెలిపారు. గ్రామంలో వస్తున్న వ్యాధుల నివారణకు వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయించాలని ప్రజలు అధికారులను కోరారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ బాల్‌రాంనాయక్, ఎంపీఓ చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి లలిత పాల్గొన్నారు.

ఇల్లరికం అల్లుడి హత్య



గొర్లఖాన్‌దొడ్డిలో విచారణ నిర్వహిస్తున్న సీఐ, ఎస్ఐలు

- భార్య, అత్తామామలపై అనుమానం
- సంఘటన స్థలాన్ని సందర్శించిన సీఐ, ఎస్ఐలు



కుర్వ నర్సింహులు (ఫైల్)

గట్టు: ఇల్లరికం అల్లుడు హత్యకు గురైన సంఘటన గొర్లఖాన్‌దొడ్డిలో ఆదివారం వెలుగు చూసింది. పోలీసులు, గ్రామస్తుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. అయిజ మండలం ఎక్లాస్‌పూరానికి చెందిన కుర్వ నర్సింహులు(34) గొర్లఖాన్‌దొడ్డికి చెందిన జయమ్మతో సుమారుగా 16 ఏళ్ల కిందట వివాహమైంది. నర్సింహులు ఇల్లరికం వచ్చి గొర్లఖాన్‌దొడ్డిలోని అత్తారింట్లో ఉంటున్నాడు. భార్య జయమ్మతో పాటుగా అత్తామామలతో అల్లుడు తరచూ గొడవ పడేవాడని చుట్టుపక్కల వారు తెలియజేశారు. శనివారం ఉదయం అల్లుడు, అత్తామామలు ఇంట్లో గొడవ పడ్డారు. ఈ క్రమంలోనే అల్లుడిని, అత్త సరోజమ్మ, మామ కర్రెప్ప, భార్య జయమ్మ అంతమొందించినట్లు తెలిసింది. ఇదేం బయటకు తెలియనీయకుండా పొలం పనులకు వెళ్లారు. కుర్వ నర్సింహులు మృతిచెందినట్లుగా సాయంత్రం విషయం బయటకు వచ్చింది. ఇదే విషయాన్ని మృతుని కుమారుడు ఎక్లాస్‌పురంలోని మృతుని చిన్నాయన కుమారుడు దస్తగిరికి ఫోన్ చేసి సమాచారం ఇచ్చాడు. మృతుని అన్న వీరన్న, తమ్ముడు పరశురాం గొర్లఖాన్‌దొడ్డికి వచ్చి మృతదేహాన్ని పరిశీలించగా.. మృతుని వృషణాలు దెబ్బతిని ఉండగా.. గొంతు వద్ద గాయాలను గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న గట్టు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గద్వాల ఆస్పత్రికి తరలించారు. గద్వాల సీఐ భీంకుమార్, గట్టు ఎస్ఐ మల్లేష్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి, వివరాలు తెలుసుకున్నారు. సంఘటనపై కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ తెలియజేశారు.

జూరాలకు తగ్గిన ఇన్‌ఫ్లో



దిగువ జలవిద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తిని పరిశీలిస్తున్న ఎస్ఈలు రామసుబ్బారెడ్డి, సురేష్

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు మూడు వారాలుగా కొనసాగిన వరద జోరు ఆదివారం తగ్గుముఖం పట్టినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. దీంతో ప్రాజెక్టు క్రస్టు గేట్లు దాదాపుగా మూసివేశారు. ఎగువ ఉన్న మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో వర్షాలు తగ్గడంతో ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టులకు వరద తగ్గినట్లు అధికారులు తెలిపారు. శనివారం జూరాల ప్రాజెక్టుకు 2.20లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, ఆదివారం సాయంత్రానికి 85వేల క్యూసెక్కులకు తగ్గినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. దీంతో తెరిచి ఉంచిన 23 క్రస్టు గేట్లలో 17 గేట్లను మూసి వేసి కేవలం 6 గేట్ల ద్వారా 43,458 క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఆవిరి రూపంలో 68, నెట్టెంపాడుకు 750, కుడి కాల్వ ద్వారా 717, ఎడమ కాల్వకు 820, కోయిల్ సాగర్‌కు 315, ఆర్డీఎస్ లింక్ కెనాల్‌కు 150, సమాంతర కాల్వకు 500 క్యూసెక్కులు ప్రాజెక్టు నుంచి మొత్తం 82,339 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 9.562 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువన ఉన్న ఆల్మట్టి ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో తగ్గినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. ప్రాజెక్టుకు 80,160 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉందని, ప్రాజెక్టు నుంచి 44,408 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 120 టీఎంసీల నీరు నిల్వ ఉంది. నారాయణపూర్ ప్రాజెక్టుకు 25వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు తెరిచి ఉంచిన గేట్లను మూసివేశారు. 6వేల క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 32.937 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

సుంకేసులలో 7గేట్ల ద్వారా నీటి విడుదల

రాజోళి: సుంకేసుల డ్యాంలో ఆదివారం ఏడు గేట్ల ద్వారా నీటిని విడుదల చేస్తున్నట్లు జేఈ రాజు తెలిపారు. ఆదివారం ఎగువ నుంచి 33,100 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో రాగా, ఏడు గేట్లను తెరిచి 30,177 క్యూసెక్కులను దిగువకు వదిలి, కేసీ కెనాల్‌కు 2,445 క్యూసెక్కులను వదిలినట్లు జేఈ పేర్కొన్నారు.

435 మెగావాట్ల విద్యుదుత్పత్తి

ఆత్మకూర్: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు దిగువ, ఎగువ జలవిద్యుదుత్పత్తి కేంద్రాల్లో ఉత్పత్తి వేగవంతంగా కొనసాగుతుందని జెన్‌కో సివిల్, ఎలక్ట్రికల్ ఎస్ఈలు రామసుబ్బారెడ్డి, సురేష్ తెలిపారు. ఆదివారం దిగువ జూరాలలోని జలవిద్యుత్ ఉప కేంద్రాన్ని సందర్శించి విద్యుదుత్పత్తిని 20 రోజుల అనంతరం పునఃప్రారంభించి పరిశీలించారు. జూరాలకు ఎగువ కర్ణాటక నుంచి అత్యధికంగా వరదనీరు చేరడంతో దిగువ విద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేపట్టలేకపోయామని తెలిపారు. వరద ఇదేస్థాయిలో కొనసాగితే ఈఏడాది లక్ష్యానికి చేరుకుంటామన్నారు. 11 యూనిట్ల ద్వారా విద్యుదుత్పత్తిని చేపడుతున్నామని ఎగువలో 5 యూనిట్ల ద్వారా 195 మెగావాట్లు, దిగువలో 6 యూనిట్ల ద్వారా 240 మెగావాట్లు విద్యుదుత్పత్తిని చేపడుతున్నారు. ఎగువ, దిగువ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో ఇప్పటి వరకు 94.480 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి సాధించామని తెలిపారు. ఎగువ జూరాలలో 3వ యూనిట్లో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో ఉన్నత స్థాయి అధికారులకు నివేదించామని, ప్రస్తుతానికి మూడవ యూనిట్‌లో ఉత్పత్తి చేపట్టలేక పోతున్నామని తెలిపారు. 11 యూనిట్ల ద్వారా ఉత్పత్తి చేపడుతున్నామని ప్రస్తుతం 36వేల క్యూసెక్కులను వినియోగించి దిగువ శ్రీశైలంకు నీటిని వదులుతున్నామని పేర్కొన్నారు.

ఎన్టీఆర్ కాల్వకు 900 క్యూసెక్కులు విడుదల

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో నీటిమట్టం నిలకడగా కొనసాగుతుంది. జూరాల ఎడమ కాల్వ ద్వారా 820 క్యూసెక్కులు, సమాంతర కాల్వ ద్వారా 451 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. ఆదివారం నాటికి పూర్తి నీటిమట్టం 1,019 అడుగులకు చేరింది. ఎన్టీఆర్ కాల్వ ద్వారా 900 క్యూసెక్కులు, వివిధ లిఫ్టుల ద్వారా 848 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కులు నీటిని వినియోగిస్తున్నామని ఏఈ సింగిరెడ్డి రజనీల్‌రెడ్డి తెలిపారు.

జాతీయ రహదారిపై కంటైనర్ బోల్తా



చెట్లలోకి దూసుకెళ్లిన కంటైనర్

కొత్తకోట రూరల్: రోడ్డు ప్రమాదంలో కంటైనర్ డ్రైవర్‌కు తీవ్రగాయాలైన ఘటన ఆదివారం తెల్లవారుజామున వనపర్తి జిల్లా కొత్తకోట మండలం మిరాసిపల్లి సమీపంలో.. ఎన్‌హెచ్44పై చోటు చేసుకుంది. హర్యానాకు చెందిన కంటైనర్ హైదరాబాద్ నుంచి బెంగుళూర్‌కు వెళ్తుండగా ఘటన జరిగింది. ఎన్‌హెచ్44పై ఓ కోళ్ల వాహనం టైర్ పంక్చర్ కావడంతో.. ఆ వాహనం డ్రైవర్ టైర్‌ను మారుస్తున్నాడు. ఈ క్రమంలో వేగంగా వచ్చిన కంటైనర్ డ్రైవర్ దేవరాజు కోళ్ల వాహనాన్ని గమనించకుండా ఢీకొట్టాడు. అంతలోనే తేరుకుని వాహనాన్ని అదుపులోకి తీసుకొచ్చే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలోనే కంటైనర్ డివైడర్ పైకి వెళ్లి అవతలివైపు రోడ్డు పక్కన చెట్లలోకి దూసుకువెళ్లింది. దీంతో దేవరాజుకు తీవ్ర గాయాలు అయ్యాయి. కాగా స్థానికుల సమాచారంతో 108లో సిబ్బంది వనపర్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

వ్యక్తిని కాపాడిన పోలీసులు

నారాయణపేట: మద్యం మత్తులో పురుగు మందు తాగి చనిపోతున్నానని బెదిరించిన ఓ వ్యక్తిని పోలీసులు కాపాడిన ఘటన రూరల్ ఠాణాలో పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని బండగొండకు చెందిన రాజు భార్య మాధవితో గొడవ పడ్డాడు. మద్యం మత్తులో గ్రామ శివారులోని గుట్టపైకి వెళ్లి పురుగుమందు తాగి చనిపోతున్నానంటూ భార్యకు ఫోన్ చేసి చెప్పాడు. ఆమె వెంటనే డయల్ 100కు ఫిర్యాదు చేయడంతో స్పందించిన ఏఎస్ఐ బాలయ్య, కానిస్టేబుల్ ఆనంద్ సెల్‌ఫోన్ టవర్ లోకేషన్ ఆధారంగా రాజును పట్టుకొని గ్రామ పెద్దలు, భార్యకు అప్పగించారు. భార్యాభర్తలకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న కారు

- ఇద్దరికి గాయాలు



ప్రమాదానికి కారణమైన కారు

కొత్తకోట రూరల్: ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. కొత్తకోట ఎస్ఐ మంజునాథ్‌రెడ్డి కథనం ప్రకారం.. వనపర్తి మండలం రాజపేట తండాకు చెందిన తల్లీకొడుకులు కాట్రావత్ సాలమ్మ, కాట్రావత్ రాములు బైక్‌పై ఆదివారం కొత్తకోటకు వచ్చారు. పనిముగించుకొని తిరిగి తండాకు వెళ్తుండగా కానాయపల్లి సమీపంలోని పెట్రోల్ బంక్ వద్ద ప్రమాదం జరిగింది. పెట్రోల్ పోసుకునేందుకు రోడ్డు క్రాస్ చేస్తూ ఓ కారు ఎదురుగా వస్తున్న సదరు బైక్‌ను ఢీకొంది. దీంతో కాట్రావత్ సాలమ్మకు తీవ్ర గాయాలు కాగా.. రాములుకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో క్షతగాత్రులను 108లో వనపర్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. సాలమ్మ పెద్ద కుమారుడు కాట్రావత్ హన్మంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



జూరాల వద్ద పర్యాటకుల రద్దీ

ఎగువ నుంచి వరద వస్తుండటంతో జూరాల ప్రాజెక్టు వద్ద గేట్లు పైకెత్తి నీటిని దిగువకు వదులుతున్నారు. దీంతో వివిధ ప్రాంతాల నుంచి జలదృశ్యాలను తిలకించేందుకు పర్యాటకులు తరలివస్తున్నారు. ఆదివారం సెలవు రోజు కావడంతో విద్యార్థులు, కుటుంబాలతో కలిసి ప్రజలు పెద్దఎత్తున జూరాల ప్రాజెక్టుకు వద్దకు చేరుకుని సరదాగా గడిపారు. పర్యాటకుల రాకతో ప్రాజెక్టు రహదారిపై ట్రాఫిక్ అంతరాయం కలిగింది. – అమరచింత